క్లుప్తంగా

పెన్షన్ల పంపిణీ 90 శాతం పూర్తి

ఒంగోలు రూరల్: మండలంలో 90 శాతం పెన్షన్ల పంపిణీని మొదటిరోజే పూర్తి చేసినట్లు ఒంగోలు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో బుధవారం రాత్రికి 90 శాతం పెన్షన్ల పంపిణీని పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వృద్ధాప్య పెన్షన్లు, దివ్యాంగులు, కళాకారులు, ఒంటరి మహిళలు, డప్పు కళాకారులు, ఆరోగ్యపరమైన, తదితర పెన్షన్లను మండలంలోని వలంటీర్లు లబ్ధిదారుల గృహాలకు వెళ్లి అందజేసినట్లు వివరించారు. సర్వర్ సమస్యల వలన ఆగిపోయిన 10 శాతం పెన్షన్లను గురువారం అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

నెలాఖరు వరకు సెక్షన్ 30

ఒంగోలు టౌన్: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఒంగోలు డివిజన్లో ఈ నెల 28వ తేదీ వరకు 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుందని ఒంగోలు డీఎస్పీ యు.నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ధర్నాలు, ర్యాలీలు నిర్వహించకుండా ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు, యూనియన్లు సహకరించాలని ఆయన కోరారు. నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు గృహ సారథులకు శిక్షణ కార్యక్రమం

నాగులుప్పలపాడు: క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, పార్టీని బలోపేతం చేసేందుకు ఏర్పాటు చేసిన సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులకు గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జేసీఎస్ మండల కన్వీనర్ కుమ్మారి సుధాకర్ తెలిపారు. ఉదయం 9 గంటలకు ఉప్పుగుండూరు–1, 2, కండ్లగుంట, పోతవరం, నిడమానూరు, కొత్తకోట, ఈదుమూడి, ముప్పాళ్ల, తిమ్మసముద్రం –1, 2 సచివాలయాల పరిధిలోని గృహ సారథులకు ఉప్పుగుండూరు గ్రామంలోని కాపు కళ్యాణ మండపంలో, సాయంత్రం 3 గంటలకు అమ్మనబ్రోలు గ్రామ సచివాలయంలో కనపర్తి–1, 2, చీర్వానుప్పలపాడు, నాగులుప్పలపాడు, చదలవాడ, మద్దిరాలపాడు, రాపర్ల, అమ్మనబ్రోలు–1, 2, మాచవరం సచివాలయాల పరిధిలోని కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులకు శిక్షణ ఇవ్వనున్నట్లు మండల కన్వీనర్ తెలిపారు. శిక్షణ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే సుధాకర్ బాబు హాజరవుతారని, ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో ఎంపికైన గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయాల కన్వీనర్లు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక పూజలు



కొబ్బరి కాయలతో స్వామివారి అలంకరణ

మార్కాపురం: భూదేవి శ్రీదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారికి 108 కొబ్బరి బొండాలతో అష్టోత్తర శతకలిశా స్థాపన పూజలు చేశారు. స్వామివారి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా రాత్రి 7 గంటలకు రథోత్సవం నిర్వహించారు. ఉత్సవానికి ముందు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అధ్యక్ష, కార్యదర్శులు మాలకొండ నరసింహారావు, ఆర్‌కేజే నరసింహం, కోశాధికారి ఉటుకూరి రామకృష్ణ, కమిటీ సభ్యులు ఏరువా దేవిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు

మార్కాపురం టౌన్: పట్టణంలోని ఓ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ శశికుమార్ తెలిపారు. పుల్లలచెరువుకు చెందిన వెంకటరెడ్డి కుమార్తె గత నెల 31న ఇంటి నుంచి మార్కాపురం వచ్చి కళాశాలకు వెళ్లకుండా ఇంటికి రాకుండా ఉండటంతో బంధుమిత్రుల ఇళ్లల్లో వెతికినా కనిపించలేదని వెంకటరెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వినియోగంలోకి పాత పోలీసుస్టేషన్

అర్ధవీడు: నిరుపయోగంగా ఉన్న పాత పోలీసుస్టేషన్‌కు మరమ్మతులు చేయించగా బుధవారం గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు, మార్కాపురం డీఎస్పీ ఎం.కిశోర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన పోలీసుస్టేషన్ భవనం నూతన పోలీసుస్టేషన్ నిర్మాణంతో నిరుపయోగంగా ఉంది. కొంతకాలం పంచాయతీ కార్యాలయంగా వినియోగించుకోగా నూతన సచివాలయాల నిర్మాణంతో తిరిగి నిరుపయోగంగా మారిపోయింది. ఈ నేపథ్యంలో ఆ భవనాన్ని పోలీసులు మరమ్మతులు చేయించి ఉన్నతాధికారులు, ఇతర సమావేశాలకు వినియోగించుకునేందుకు సిద్ధం చేసుకున్నారు. నిరుపయోగంగా ఉన్న భవనాన్ని తిరిగి వినియోగంలోకి తీసుకొని రావడం హర్షణీయమని ఎమ్మెల్యే అన్నారు. కంభం సీఐ ఎం.రాజేష్, ఎస్‌ఐ వెంకటేశ్వరనాయక్, ఎంపీపీ , జెడ్పీటీసీ పాల్గొన్నారు.

జోరుగా ప్రకృతి వ్యవసాయం



ప్రకృతి ఆకులతో కషాయాలు తయారు చేస్తున్న రైతులు

- పల్లెల్లో క్రమంగా పెరుగుతున్న చైతన్యం
- కొత్తపట్నం మండలంలో 4 వేల ఎకరాల్లో సాగు

కొత్తపట్నం: వ్యవసాయంలో రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగంతో రైతులపై ఆర్థిక భారం పెరుగుతూ వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న, సన్నకారు రైతులు భారీగా నష్టపోయారు. పొలం నిర్జీవమై దిగుబడి గణనీయంగా తగ్గిపోతోంది. ఈ క్రమంలో 2016 నుంచి ప్రకృతి వ్యవసాయం సాగును ప్రభుత్వం ప్రోత్సహించింది. అందులో భాగంగా కొత్తపట్నం మండలంలో మొదటిగా 5 పంచాయతీలను ఎంపిక చేసి ప్రకృతి వ్యవసాయం సాగును ప్రారంభించారు. ఇప్పుడు అది 15 పంచాయతీలకు విస్తరించింది. సుమారు 4 వేల ఎకరాల్లో 2,223 మంది చిన్న, సన్న కారు రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు.

ప్రధాన పంటలు...

మండలంలో ప్రకృతి వ్యవసాయం కింద ప్రధానంగా వేరుశనగ, శనగ, వరి, పచ్చిమిర్చి, చామదుంపలు, ఆకుకూరలు, కూరకాయలు పండిస్తున్నారు. కూత వేటు దూరంలో ఉన్న ఒంగోలు మార్కెట్‌లో ఎక్కువ శాతం ఇక్కడ పండించే పంటలే అమ్ముతున్నారు. ఎక్కువ శాతం రైతులే నేరుగా వెళ్లి అమ్ముకుంటున్నారు. పురుషులు పండిస్తే మహిళలు తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటలు కావడంతో ధర కూడా అనుకూలంగా ఉంటోంది. రైతు సొంతంగా తయారు చేసుకున్న ఎరువులు వాడుకోవడం వలన ఖర్చులు తగ్గి ఆదాయం రెట్టింపు అవుతోంది. ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించే రైతులు ధాన్యాన్ని ఏడాది పాటు తీసుకుని నిల్వ చేసుకుంటారు. మిగిలిన ధాన్యాన్ని అమ్ముకుంటారు.

స్వయంగా కషాయాల తయారీ...

పొలాల చుట్టుపక్కల ఉండే ఆకులతో కషాయాలు తయారు చేసి పైరుకు వాడతారు. ఆవు మూత్రం తీసుకుని తయారు చేసిన కషాయాలను పైర్లకు పిచికారీ చేస్తారు. ఎటువంటి క్రిమి సంహారక మందులు వాడకుండా పూర్తిగా సొంతంగా తయారు చేసిన కషాయాలతో సేద్యం చేస్తారు. చేసిన కషాయాలను ఇతర మండలాలు, దూర ప్రాంతాలకు చెందిన రైతులు కూడా కొనుగోలు చేసుకెళ్తారు. తక్కువ ఖర్చు కావడంతో ఎక్కువ మంది ప్రకృతి వ్యవసాయానికి మొగ్గు చూపుతున్నారు. సాగుచేసిన ధాన్యాన్ని, కాయగూరలను రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. పొలాల్లో వేసే పైరు మధ్యలో అంతర్ పంటలు వేయడం వలన పురుగు మందులు వాడకుండా పురుగు నివారణ జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి పెట్టి నిధులు కేటాయించి ప్రోత్సహిస్తోందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



పైరుకు పిచికారీ చేసేందుకు సిద్ధంగా ఉన్న కషాయాలు



ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న మొక్క జొన్న



ప్రకృతి కషాయాలతో సాగు చేస్తున్న వేరుశనగ పంటను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం



ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. వారికి కావాల్సిన నిధులు కూడా సరఫరా చేస్తోంది. మండలానికి సీఆర్పీలు, సిబ్బందిని పెట్టి డ్వాక్రా గ్రూపు సభ్యులకు కూడా అవగాహన కల్పించి ప్రకృతి వ్యవసాయం పెంచుతోంది. ప్రకృతి వ్యవసాయంలో సమస్యలను జిల్లా అడ్వైజరీ బోర్డు కమిటీలో పెద్ద ఎత్తున చర్చించడం, పరిష్కరించడం జరుగుతోంది. నూరు శాతం ప్రకృతి వ్యవసాయం సాగుకు నా వంతు కృషి చేస్తాను.

– ఆళ్ల రవీంద్రరెడ్డి, జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్

నూరు శాతం ప్రకృతి వ్యవసాయానికి ప్రయత్నం



ఇప్పటికే కొత్తపట్నం మండలంలో అధికారికంగా, అనధికారికంగా కలుపుకుని సుమారు 4 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. క్రిమిసంహారక మందులకు స్వస్తి చెప్పి ప్రకృతి వ్యవసాయానికి రైతులు మొగ్గుచూపుతున్నారు. రైతుకు నష్టం లేకుండా తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం చూస్తున్నారు. ప్రభుత్వం కూడా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. నిధులు కూడా కేటాయిస్తోంది.

– వి.సుభాషిణి, వ్యవసాయ శాఖ ఏడీ

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం



2016 ఏడాది నుంచి ఇప్పటి వరకు ప్రకృతి వ్యవసాయం సాగుచేస్తున్నాం. గతంలో క్రిమిసంహారక మందులతో కూడిన కాయగూరలు, ఆకుకూరలు తినేవాళ్లం. ఫలితంగా అనేక వ్యాధులొచ్చి హాస్పిటళ్లకెళ్లేవాళ్లం. ప్రస్తుతం నా ఇంటి ముందే అన్ని రకాల ఆకుకూరలు, కాయగూరలు పండించుకుంటున్నాం. వాటిని తినడం వలన ఇప్పుడు హాస్పిటల్‌కు వెళ్లే అవసరం లేకుండా పోయింది. నన్ను చూసి చాలా మంది ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్నారు.

– దద్దాల రామారావు ఐసీఆర్పీ

ఆశాజనకంగా లేని బడ్జెట్

- ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి

ఒంగోలు టౌన్: కేంద్ర ప్రభుత్వం రూ.45 లక్షల కోట్లతో బుధవారం ప్రవేశపెట్టిన 2023–24 వార్షిక బడ్జెట్ ఆశాజనకంగా లేదని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. ప్రాజెక్టుల ఏర్పాటు, నిధుల కేటాయింపులో నిరాశపరిచారన్నారు. పేదల అభ్యున్నతికి, వస్తుత్పత్తికి పెద్దపీట వేసినప్పటికీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించినంత వరకు ఆశాజనకంగా లేదంటూ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రానికి ఈసారి కూడా కొత్త రైల్వే లైన్లు, ప్రత్యేక హోదా ప్రకటన లేకపోవడం బాధాకరమన్నారు. వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధుల కేటాయింపుపై బడ్జెట్లో ప్రస్తావించలేదన్నారు. విభజనతో ఆర్థికలోటులో ఉన్న రాష్ట్రానికి తప్పకుండా న్యాయం చేస్తారని ఆశిస్తున్నట్లు ఎంపీ పేర్కొన్నారు.

కార్పొరేట్ శక్తులకు మేలు చేసే బడ్జెట్

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాలనలో కుబేరులవుతున్న కార్పొరేట్ శక్తులకు మరింత మేలు చేసేలా బుధవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ఉందని సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసి జిల్లా కార్యదర్శి సీఎస్ సాగర్ అభివర్ణించారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకానికి గతంలో కంటే 30 శాతం నిధులు తగ్గించారని, వ్యవసాయరంగ సంక్షేమానికి, పౌరసరఫరాలకు తగినంత నిధులు కేటాయించలేదని విమర్శించారు. పెట్టుబడుల పేరుతో ప్రభుత్వ ఆస్తుల్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు బడ్జెట్‌లో ప్రయత్నించారన్నారు. పేదల కొనుగోలు శక్తిని దెబ్బతీసే విధంగా బడ్జెట్ ఉందన్నారు.

ఏపీకి మరోసారి మొండిచేయి...

కేంద్ర ఆర్థిక మంత్రి బుధవారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాష్ట్రానికి మరోసారి మొండి చేయి చూపించారని సీపీఐ జిల్లా కార్యదర్శి కేఎల్ నారాయణ విమర్శించారు. బడ్జెట్లో రూ.2.40 లక్షల కోట్లను రైల్వేలకు కేటాయించినప్పటికీ రాష్ట్రానికి చెందిన నడికుడి–శ్రీకాళహస్తి ఊసే లేదన్నారు. విద్యారంగం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ప్రస్తావన లేకపోవడం విచారకరమన్నారు. ఇది ఎన్నికల బడ్జెట్ అని, బడాబాబులను ఉత్సాహపరిచే బడ్జెట్ అని ఆయన వ్యాఖ్యానించారు.

రైతులను విస్మరించిన కేంద్ర బడ్జెట్

కేంద్ర బడ్జెట్లో రైతులను విస్మరించారని, వ్యవసాయ రంగానికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి షేక్ సైదా బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. దేశంలో వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్న వారు 70 శాతం మంది ఉన్నారని గుర్తుచేశారు. దేశ ప్రజలకు ప్రధాన ఆదాయ వనరు అయిన వ్యవసాయ రంగాన్ని దెబ్బతీయడం సరికాదన్నారు. బ్యాంకుల ద్వారా రైతులకు 20 లక్షల కోట్ల రూపాయల రుణాలు ఇప్పిస్తామని చెప్పారని, పేద ప్రజల సంక్షేమం గురించి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు, మంగళగిరి ఎయిమ్స్, పెట్రో యూనివర్శిటీకి నిధులు కేటాయించడం మినహా రాష్ట్రానికి ఎలాంటి మేలు చేయలేదని పేర్కొన్నారు.

వైభవంగా నరసింహస్వామి పుట్ట తిరునాళ్ల



స్వామివారి సన్నిధిలో పూజలు చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

పెద్దారవీడు: మండలంలోని తోకపల్లె గ్రామంలో సద్గురు యోగానంద నరసింహస్వామి 67వ పుట్ట తిరునాళ్ల మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకులు భవానిప్రసాద్ ఆధ్వర్యంలో తెల్లవారుజామున స్వామివారికి పంచామృతాభిషేకం చేసి, పట్టువస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి చిత్రపటాన్ని గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. 41 రోజులు దీక్ష ఆచరించిన స్వాములు ఇరుముడితో ఊరేగింపుగా బయలుదేరి ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయం ప్రాంగణంలో హోమంలో పాల్గొని దీక్ష విరమించారు. మహిళా భక్తులు పుట్టను పసుపు, కుంకుమ, పూలతో అలంకరించి పూజలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుండి భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పూజల్లో పాల్గొన్న మంత్రి సురేష్

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ స్వామి వారి తిరునాళ్లలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మంత్రిని ఘనంగా సన్మానించారు. మధ్యాహ్నం దాతల సాకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం భారత కోలాటం, రాత్రికి భక్తప్రహ్లాద నాటకం ప్రదర్శించారు. మంత్రి వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్టారెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య, సర్పంచ్ జిల్లెల నాగమల్లేశ్వరి, నాయకులు రామిరెడ్డి, నరాల రామచంద్రుడు, సొంటి నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కంభం: స్థానిక నాయక్ వీధిలో రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు సమాచారం రావడంతో మంగళవారం రాత్రి తనిఖీలు చేసిన రెవెన్యూ అధికారులు 20 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

5న సంఘీభావ సభ



కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: మార్చిలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థులుగా పోటీచేస్తున్న వారికి ఈ నెల 5వ తేదీ ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో సంఘీభావ సభ నిర్వహించనున్నట్లు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు తెలిపారు. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల తూర్పు రాయలసీమ నియోజకవర్గ పట్టభద్రుల అభ్యర్థిగా మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థిగా పొక్కిరెడ్డి బాబురెడ్డి పోటీ చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సంఘీభావ సభ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటికే ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, పెన్షనర్ల సంఘాలతో పాటుగా కార్మిక, యువజన, విద్యార్థి సంఘాలు వీరికి మద్దతు ప్రకటించినట్లు చెప్పారు. కార్యక్రమంలో యూటీఎఫ్, సీఐటీయూ, జేవీవీ, పెన్షనర్ల నాయకులు డి.వీరాంజనేయులు, ఎన్.చిన్నస్వామి, వై.వెంకట్రావు, కాటం సుబ్బారావు, జయప్రకాష్, శేషయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు మహోత్సవం



మస్తాన్ దర్గా వద్ద భక్తులు

ఒంగోలు: స్థానిక ట్రంకురోడ్డు, కొత్తపట్నం రోడ్డు కూడలిలో ఉన్న శ్రీశ్రీశ్రీ హజరత్ సయ్యద్ గోరే మస్తాన్ అవులియా మస్తాన్‌దర్గా 44వ ఉరుసు గంధ మహోత్సవాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గోపాల్‌నగరం ఒకటో లైనులోని కృష్ణ స్వగృహం నుంచి పకీర్లు జల్సాతోరను, నవరంగ్ వాయిద్యాలు, సాము ప్రదర్శనలతో అలంకరించిన పూలపల్లకిలో గంధ మహోత్సవం ఊరేగింపుగా దర్గా వద్దకు చేరుకుంది. వేలాది మంది భక్తులు కులమతాలకు అతీతంగా గత 44 సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్న ఈ ఉత్సవంలో పాల్గొని మస్తాన్‌దర్గాని దర్శించుకుని బాబా ఆశీర్వాదం పొంది ఫాతెహా సమర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువ నాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి, నగరంలోని పురప్రముఖులు హాజరైనట్లు నిర్వాహకుడు పూరిమిట్ల హజరత్ బాబా తెలిపారు.

శిద్దా దంపతులకు ఘన సత్కారం



శిద్దా సుధీర్‌కుమార్ దంపతులను సత్కరిస్తున్న ఆలయ ట్రస్టు నిర్వాహకులు

ఒంగోలు: యువ పారిశ్రామికవేత్త, చాంబర్ ఆఫ్ కామర్స్ ఏపీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ నాయకుడు శిద్దా సుధీర్‌కుమార్, శ్రుతి దంపతులను అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ఆలయ ట్రస్టు నిర్వాహకులు బుధవారం ఘనంగా సత్కరించారు. వాసవీ క్షేత్రంలో నిర్వహించిన నాలుగో ప్రతిష్ఠాపన వార్షికోత్సవంలో భాగంగా ఆలయానికి అవసరమైన రూ.60 లక్షల విలువైన గ్రానైట్‌ను శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా సుధీర్ దంపతులు బహూకరించారు. ఈ సందర్భంగా ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, పెనుగొండ క్షేత్ర పీఠాధిపతులు కృష్ణానందపురి స్వామి, శ్రీవాసవీ పీఠాధిపతులు సచ్చిదానంద సరస్వతి, ప్రజ్ఞానందస్వామిలతో పాటు శిద్దా సుధీర్‌కుమార్ దంపతులు పాల్గొన్నారు. నూతన అన్నదాన భవనం, వాసవీ రుషి గోత్ర సువర్ణ మందిరానికి రూ.60 లక్షల విలువైన గ్రానైట్‌ను బహూకరించడంపై వారు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శిద్దా సుధీర్‌కుమార్ మాట్లాడుతూ ఆర్యవైశ్య ఆరాధ్యదైవం శ్రీవాసవీ అమ్మవారి నాలుగో ప్రతిష్ఠాపన వార్షికోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. వాసవీ అమ్మవారి కరుణాకటాక్షాలు అందరికీ కలగాలని కోరుకుంటున్నానన్నారు. ఈ సందర్భంగా శిద్దా సుధీర్‌కుమార్ దంపతులను దుశ్శాలువాతో సత్కరించి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందించారు.

అంకితభావంతో పనిచేయండి

- ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి

ఒంగోలు రూరల్: మండలంలోని అన్ని గ్రామాల సచివాలయ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని ఒంగోలు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి కోరారు. ఒంగోలు మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని గ్రామాల కార్యదర్శులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వివిధ అంశాలపై ఎంపీడీవో స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తొలుత సచివాలయాల్లో బయోమెట్రిక్ హాజరుపై ఎంపీడీవో మాట్లాడారు. సచివాలయాల్లో ఉదయం 66 శాతం మంది బయోమెట్రిక్ నమోదు చేస్తుంటే.. సాయంత్రం 5 గంటలకు 33 శాతం మాత్రమే నమోదవుతోందన్నారు. బయోమెట్రిక్ హాజరును నిర్లక్ష్యం చేయవద్దని, ఉదయం 10.30 గంటలకు, సాయంత్రం 5 గంటలకు బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలని, ఇదే చివరి హెచ్చరికని స్పష్టం చేశారు. ప్రతిఒక్కరూ యూనిఫాం ధరించాలని, ఎలాంటి మినహాయింపు లేదని అన్నారు. యూనిఫాం ధరించని వారి సమాచారాన్ని ఎంపీడీవో కార్యాలయానికి తెలియజేయాలన్నారు. సచివాలయ సిబ్బంది వివిధ శాఖల విధులు నిర్వహించడం జరుగుతోందని, వారు ఆయా శాఖల్లో అమలు చేస్తున్న పథకాల పురోగతిని వారి కార్యదర్శులకు తప్పనిసరిగా ఎప్పటికప్పుడు అందజేయాలని కోరారు. కార్యదర్శులు డ్రాయింగ్ ఆఫీసర్లుగా లేని చోట కూడా సంబంధిత కార్యదర్శులకు వారి సచివాలయ సమాచారం పూర్తిస్థాయిలో అందించాలన్నారు. నిర్లక్ష్య ధోరణి వీడి అన్నిశాఖల వారు ప్రభుత్వ పథకాల అమలుపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థల పట్టాలు పొందిన లబ్ధిదారులంతా గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామస్థాయిల్లో సచివాలయాలకు వచ్చే లబ్ధిదారులు, ఇతర సిబ్బందితో క్రమశిక్షణతో మెలగాలని, అప్పుడే సచివాలయ సిబ్బందిపై గౌరవం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ మారెడ్డి రమణమ్మ, ఒంగోలు మండలంలోని సచివాలయాల కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంకాళమ్మ తల్లికి పూజలు



అంకాళమ్మ తల్లికి పూజలు చేస్తున్న దుంపా చెంచిరెడ్డి, భక్తులు



పొంగళ్లు పెట్టి ఊరేగిస్తున్న భక్తులు

చీమకుర్తి: అంకాళమ్మతల్లి వార్షికోత్సవం సందర్భంగా సంతనూతలపాడులో బుధవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి హంసవాహనాలపై ఊరేగించారు. రెండు రోజుల నుంచి జరుగుతున్న వార్షికోత్సవం సందర్భంగా స్థానిక భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, స్థానిక సర్పంచ్ దర్శి నాగమణి, భక్తులు పాల్గొన్నారు.

అండర్-19 ప్రపంచకప్ విజేత జట్టుకు బీసీసీఐ సన్మానం

ఐసీసీ తొలిసారి నిర్వహించిన అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్‌ను సాధించిన టీమిండియా సభ్యులను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) బుధవారం అహ్మదాబాద్‌లో ఘనంగా సన్మానించింది. న్యూజిలాండ్‌తో ఆఖరి టి20 పోరుకు ముందు జరిగిన ఈ వేడుకలో బోర్డు ప్రకటించిన రూ. 5 కోట్ల నజరానాను భారత దిగ్గజం సచిన్ చేతుల మీదుగా అండర్-19 జట్టు కెప్టెన్ షఫాలీ వర్మ అందుకుంది. అమ్మాయిలు అద్భుతంగా రాణించారని కితాబిచ్చిన 'మాస్టర్'... ఈ ఘనతతో మరెంతో మంది మహిళా క్రికెటర్ల కలలకు ఊపిరి పోశారని అన్నారు.



గిల్ జిగేల్...


గిల్

- భారత ఓపెనర్ మెరుపు సెంచరీ
- ఆఖరి టి20 పోరులో టీమిండియా 168 పరుగులతో విజయం
- కివీస్‌పై 2-1తో సిరీస్ సొంతం

అహ్మదాబాద్: మోదీ స్టేడియంలో భారత్ పరుగుల మోత మోగించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శుబ్‌మన్ గిల్ (63 బంతుల్లో 126 నాటౌట్; 12 ఫోర్లు, 7 సిక్సర్లు) తన బ్యాటింగ్ సునామీని చూపించాడు. దీంతో ఆఖరి టి20లో టీమిండియా 168 పరుగుల భారీ తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి 2-1తో సిరీస్ గెలుచుకుంది. మొదట భారత్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. రాహుల్ త్రిపాఠి (22 బంతుల్లో 44; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరిపించాడు. అనంతరం న్యూజిలాండ్ 12.1 ఓవర్లలో 66 పరుగులకే కుప్పకూలింది. 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' హార్దిక్ పాండ్యా నాలుగు వికెట్లు తీశాడు.

గిల్ విధ్వంసం

ఇషాన్ కిషన్ (1) రెండో ఓవర్లోనే నిష్క్రమించగా... గిల్, త్రిపాఠి కివీస్ బౌలర్లపై ఆకాశమే హద్దుగా చెలరేగారు. రెండో వికెట్‌కు ఈ జోడీ మెరుపులతో 7 ఓవర్ల వ్యవధిలోనే భారత్ 80 పరుగులు చేసింది. తర్వాత సూర్యకుమార్ (13 బంతుల్లో 24; 1 ఫోర్, 2 సిక్సర్లు) వేగంగా ఆడే ప్రయత్నంలో అవుటయ్యాడు. కెప్టెన్ హార్దిక్ పాండ్యా క్రీజులోకి రాగా... 15 ఓవర్లలో భారత్ స్కోరు 156/3. శుబ్‌మన్ 44 బంతుల్లో 67 పరుగులతో ఉన్నాడు. గిల్ అప్పటిదాకా ఒక ఆట, 16వ ఓవర్ నుంచి మరో ఆట ఆడాడు. భారీ సిక్సర్లతో విరుచుకుపడిన గిల్... లిస్టర్, టిక్నర్, ఫెర్గూసన్ ఎలా ఎవరెదురైనా... బంతుల్ని అదేపనిగా బౌండరీ దాటించాడు. పాండ్యా ఆడిన బంతుల్ని మినహాయిస్తే... గిల్ 16 బంతులను వరుసగా 0, 6, 6, 1, 6, 4, 0, 6, 1, 4, 6, 1, 4, 1, 4, 6లుగా ధనాదంచేశాడు. దీంతో 4 ఓవర్లలోనే భారత్ 72 పరుగులు చేసింది. ఇందులో 56 పరుగులు గిల్‌వే! ఈ క్రమంలో 54 బంతుల్లో సెంచరీ సాధించాడు. ఆఖరి ఓవర్లో పాండ్యా (17 బంతుల్లో 30; 4 ఫోర్లు, 1 సిక్స్) అవుట్‌కాగా కేవలం 6 పరుగులే వచ్చాయి.

భారత్ పేస్‌కు కివీస్ బ్యాటర్స్ వణికారు. మూడో ఓవర్లోనే కివీస్ 7 పరుగులకే 4 వికెట్లను కోల్పోవడంతో భారత్ విజయానికి బాటపడింది. మిచెల్, సాన్‌ట్నర్ మాత్రమే రెండంకెల స్కోరు చేశారు.


సిరీస్ ట్రోఫీతో కెప్టెన్ హార్దిక్

స్కాన్ చేయండి
ఈ రోజు హైలైట్ కొరకు

126 అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన భారత క్రికెటర్‌గా శుబ్‌మన్ గిల్ (126 నాటౌట్) గుర్తింపు పొందాడు. కోహ్లి (122 నాటౌట్; అఫ్గానిస్తాన్‌పై 2022 లో) పేరిట ఉన్న రికార్డును గిల్ సవరించాడు.

168 అంతర్జాతీయ టి20ల్లో పరుగుల తేడా పరంగా భారత్‌కిదే అతిపెద్ద విజయం. 2018లో ఐర్లాండ్‌పై 143 పరుగుల తేడాతో సాధించిన విజయం రెండో స్థానానికి వెళ్లింది.

5 భారత్ తరఫున మూడు ఫార్మాట్‌లలో (టెస్టు, వన్డే, టి20లు) సెంచరీ సాధించిన ఐదో క్రికెటర్‌గా గిల్ నిలిచాడు. గతంలో రైనా, కేఎల్ రాహుల్, రోహిత్, కోహ్లి ఈ ఘనత సాధించారు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) బ్రేస్‌వెల్ 1; గిల్ (నాటౌట్) 126; త్రిపాఠి (సి) ఫెర్గూసన్ (బి) సోధి 44; సూర్యకుమార్ (సి) బ్రేస్‌వెల్ (బి) టిక్నర్ 24; పాండ్యా (సి) బ్రేస్‌వెల్ (బి) మిచెల్ 30; హుడా (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 234.**
వికెట్ల పతనం: 1-7, 2-87, 3-125, 4-228.
బౌలింగ్: లిస్టర్ 4-0-42-0, బ్రేస్‌వెల్ 1-0-8-1, ఫెర్గూసన్ 4-0-54-0, టిక్నర్ 3-0-50-1, ఇష్ సోధి 3-0-34-1, సాన్‌ట్నర్ 4-0-37-0, మిచెల్ 1-0-6-1. **న్యూజిలాండ్ ఇన్నింగ్స్:** అలెన్ (సి) సూర్య (బి) పాండ్యా 3; కాన్వే (సి) పాండ్యా (బి) అర్ష్‌దీప్ 1; చాప్‌మన్ (సి) ఇషాన్ (బి) అర్ష్‌దీప్ 0; ఫిలిప్స్ (సి) సూర్య (బి) పాండ్యా 2; మిచెల్ (సి) మావి (బి) ఉమ్రాన్ 35; బ్రేస్‌వెల్ (బి) ఉమ్రాన్ 8; సాన్‌ట్నర్ (సి) సూర్య (బి) మావి 13; ఇష్ సోధి (సి) త్రిపాఠి (బి) మావి 0; ఫెర్గూసన్ (సి) ఉమ్రాన్ (బి) పాండ్యా 0; టిక్నర్ (సి) ఇషాన్ (బి) పాండ్యా 1; లిస్టర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (12.1 ఓవర్లలో ఆలౌట్) 66. వికెట్ల పతనం:** 1-4, 2-4, 3-5, 4-7, 5-21, 6-53, 7-53, 8-54, 9-66, 10-66. **బౌలింగ్:** హార్దిక్ పాండ్యా 4-0-16-4, అర్ష్‌దీప్ సింగ్ 3-0-16-2, ఉమ్రాన్ మాలిక్ 2.1-0-9-2, కుల్దీప్ యాదవ్ 1-0-12-0, శివమ్ 2-0-12-2.

ఆంధ్ర 379 ఆలౌట్

ఎడమచేతి వాటంతో బ్యాటింగ్ చేసిన విహారి


విహారి

ఇండోర్: డిఫెండింగ్ చాంపియన్ మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 127.1 ఓవర్లలో 379 పరుగులకు ఆలౌటైంది. రెండో రోజు ఆటలో ఆంధ్ర కెప్టెన్ హనుమ విహారి (27; 3 ఫోర్లు) చేతి గాయంతో బాధపడుతున్నా జట్టు అవసరాలరీత్యా ఎడమచేతి వాటం బ్యాటింగ్ చేయడం హైలైట్‌గా నిలిచింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి మధ్యప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు కోల్పోయి 144 పరుగులు చేసింది. ప్రస్తుతం మధ్యప్రదేశ్ మరో 235 పరుగులు వెనుకంజలో ఉంది. ఆంధ్ర బౌలర్లలో శశికాంత్ రెండు వికెట్లు తీయగా... నితీశ్ కుమార్ రెడ్డి, పృథ్వీరాజ్ ఒక్కో వికెట్ తీశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 262/2తో ఆట కొనసాగించిన ఆంధ్ర ఒకదశలో 323/2తో పటిష్టంగా కనిపించింది. అయితే సెంచరీ పూర్తి చేసుకున్న కరణ్ షిండే (110; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు)... రికీ భుయ్ (149; 18 ఫోర్లు, 1 సిక్స్) ఐదు పరుగుల తేడాలో అవుటయ్యాక ఒక్కసారిగా ఆంధ్ర ఇన్నింగ్స్ కుప్పకూలింది. 30 పరుగుల తేడాతో ఆంధ్ర జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 353/9గా నిలిచింది. ఈ దశలో తొలి రోజు ఆటలో గాయపడి రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన కెప్టెన్ హనుమ విహారి క్రీజులోకి వచ్చాడు. చేతి గాయాన్ని లెక్కచేయకుండా తన సహజశైలి కుడిచేతి వాటం బదులుగా ఎడమచేతి వాటంతో విహారి బ్యాటింగ్ చేసి ఔరా అనిపించాడు. చివరి వరుస బ్యాటర్ లలిత్ మోహన్ (22 నాటౌట్; 3 ఫోర్లు)తో కలిసి హనుమ విహారి 26 పరుగులు జోడించి సారాంశ్ జైన్ బౌలింగ్‌లో ఎల్బీగా వెనుదిరగడంతో ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ ముగిసింది.

జాతీయ స్కూల్స్ చెస్‌లో తెలంగాణకు ఏడు పతకాలు


యశ్వి జైన్

సాక్షి, హైదరాబాద్: జాతీయ స్కూల్స్ చెస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడాకారులు పతకాల పంట పండించారు. తమిళనాడులో జరిగిన ఈ పోటీల్లో తెలంగాణకు ఏడు పతకాలు లభించాయి. ఇందులో ఐదు స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం ఉన్నాయి. అండర్-15 బాలుర విభాగంలో వేముల అద్వైత్ విఘ్నేశ్ (7.5 పాయింట్లు)... అండర్-15 బాలికల విభాగంలో యశ్వి జైన్ (7 పాయింట్లు)... అండర్-13 బాలుర విభాగంలో చల్లా సహర్ష (8 పాయింట్లు)... అండర్-11 బాలికల విభాగంలో మోదిపల్లి దీక్షిత (7.5 పాయింట్లు)... అండర్-9 బాలికల విభాగంలో పుంగవనం సంహిత (8 పాయింట్లు) పసిడి పతకాలు గెలిచారు. అండర్-7 బాలుర విభాగంలో ఆదుర్ల దివిత్ రెడ్డి (7.5 పాయింట్లు) కాంస్యం, అండర్-7 బాలికల విభాగంలో బోగా వంశిక (7 పాయింట్లు) రజతం సాధించారు. పతకాలు సాధించిన వారికి నెలనెలా భారత గ్రాండ్‌మాస్టర్ ఎం.శ్యామ్‌సుందర్‌తో ఉచిత శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తామని తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ ప్రకటించారు.

ప్రిక్వార్టర్స్‌లో సాయిప్రణీత్



బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ సాయిప్రణీత్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో సాయిప్రణీత్ 21-13, 21-14తో మాడ్స్ క్రిస్టోఫర్సన్ (డెన్మార్క్)పై గెలుపొందాడు. మరో మ్యాచ్‌లో కిరణ్ జార్జి (భారత్) 21-17, 19-21, 23-21తో చెయుక్ యి లీ (హాంకాంగ్)ను ఓడించాడు. అయితే భారత్‌కే చెందిన సమీర్ వర్మ, ప్రియాన్షు రజావత్, మిథున్ మంజునాథ్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. ప్రియాన్షు 21-14, 19-21, 25-27తో హియో క్వాంగ్ హీ (దక్షిణ కొరియా) చేతిలో... సమీర్ వర్మ 14-21, 16-21తో లీ షి ఫెంగ్ (చైనా) చేతిలో.. మిథున్ 18-21, 12-21తో నిషిమోటో (జపాన్) చేతిలో ఓడిపోయారు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో సిక్కి రెడ్డి-రోహన్ కపూర్ జోడీ 21-11, 21-16తో టై అలెగ్జాండర్-జోసెఫిన్ వు (కెనడా) ద్వయంపై గెలుపొంది ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది.

సినిమా


రజనీకాంత్

జైసల్మేర్‌లో జైలర్

రాజస్థాన్‌లోని జైసల్మేర్‌కు వెళ్లారు 'జైలర్'. రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'జైలర్'. రమ్యకృష్ణ, తమన్నా, శివరాజ్ కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాలో మోహన్‌లాల్ ఓ అతిథి పాత్ర చేస్తున్నారు. ఇటీవలే చెన్నైలో ఒక భారీ షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న 'జైలర్' చిత్ర యూనిట్ ఇప్పుడు 'జైసల్మేర్'కు చేరుకుంది. ఈ షూటింగ్‌లో పాల్గొనడానికి ఆల్రెడీ రాజస్థాన్‌లో ల్యాండ్ అయ్యారు రజనీకాంత్. ఈ షెడ్యూల్ దాదాపు రెండు వారాలు జరగనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రజనీకాంత్ – మోహన్‌లాల్‌పై కీలక సన్నివేశాలను ప్లాన్ చేశారని సమాచారం. ఇక ఈ చిత్రం ఈ ఏడాది ఆగస్టులో విడుదలయ్యే అవకాశం ఉంది.

హెలికాప్టర్‌లో షూటింగ్‌కి...

హెలికాప్టర్‌లో షూటింగ్ లొకేషన్‌కు వెళుతున్నారు కమల్‌హాసన్. 1996లో హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇండియన్' సినిమాకు సీక్వెల్‌గా వీరిద్దరి కాంబినేషన్‌లోనే 'ఇండియన్ 2' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం కడపలోని గండికోట విలేజ్‌లో జరుగుతోంది. తిరుపతి నుంచి గండికోట లొకేషన్‌కు రోజూ హెలికాప్టర్‌లో వెళ్తున్నారు కమల్‌హాసన్. కాగా కమల్ హెలికాప్టర్ రైడ్‌కు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రం షూటింగ్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి, కాల్‌షీట్స్, షూటింగ్ సమయం వృథా కాకుండా చూసేందుకు కమల్ ఇలా హెలికాప్టర్ రైడ్ చేస్తున్నారన్నది కోలీవుడ్ టాక్. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సిద్ధార్థ్, రకుల్‌ప్రీత్‌సింగ్, బాబీ సింహా కీ రోల్స్ చేస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాదే విడుదల కానుంది.


కమల్‌హాసన్

పల్లెటూరి ప్రేమ

పార్వతీశం, జశ్విక జంటగా వైభవ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'తెలుసా.. మనసా..'. వర్షా ముందాడ, మాధవి నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను 'దిల్' రాజు విడుదల చేశారు. వైభవ్ మాట్లాడుతూ– ''ఓ గ్రామంలో బెలూన్స్ అమ్ముకునే మల్లిబాబు (పార్వతీశం), అదే ఊర్లో పనిచేసే హెల్త్ అసిస్టెంట్ సుజాత (జశ్విక)ను ప్రేమిస్తాడు. అయితే సుజాతకు మల్లిబాబు దూరం కావాల్సి వస్తుంది. ఆ తర్వాత వారిద్దరూ కలుసుకున్నారా? లేదా అనేది చిత్ర కథ'' అన్నారు. ''న్యూ ఏజ్ లవ్ స్టోరీ చిత్రమిది'' అన్నారు వర్షా ముందాడ, మాధవి.


'శశివదనే'లో ఓ దృశ్యం

ఆ పేరుని తెరపై చూడాలనుకున్నా!

– శౌరి చంద్రశేఖర్ టి. రమేష్

''మా నాన్న చంద్రశేఖర్‌గారు ప్రతివారం నన్ను ఏదో ఒక సినిమాకి తీసుకెళ్లేవారు. అలా చిన్నతనంలోనే సినిమాలపై ఇష్టం మొదలైంది. మా నాన్నగారు చనిపోయాక ఆయన పేరుని నా పేరులో పెట్టుకున్నాను. ఆ పేరుని తెరపై చూడాలనే నా కోరిక 'బుట్టబొమ్మ' ద్వారా తీరుతుండటం హ్యాపీగా ఉంది'' అన్నారు శౌరి చంద్రశేఖర్ టి. రమేష్. అనిఖా సురేంద్రన్, సూర్య వశిష్ఠ, అర్జున్ దాస్ ముఖ్య పాత్రల్లో రూపొందిన చిత్రం 'బుట్టబొమ్మ'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 4న విడుదల కానుంది. ఈ చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయమవుతున్న చంద్రశేఖర్ టి.రమేష్ మాట్లాడుతూ– ''రామ్ గోపాల్ వర్మ గారి కార్పొరేషన్‌లో పని చేశాను. ఈశ్వర్ నివాస్‌గారు దర్శకత్వం వహించిన నాలుగు హిందీ సినిమాలకు పని చేశాను. ఆ తర్వాత సుకుమార్‌గారి వద్ద 'జగడం' నుంచి 'పుష్ప' సినిమా వరకు పని చేశాను. మలయాళ మూవీ 'కప్పేల'ని సితార వారు రీమేక్ చేస్తున్నారని తెలిసి, నేనే సంప్రదించాను. 'కప్పేల'లోని మెయిన్ పాయింట్ తీసుకొని తెలుగు నేటివిటీకి తగ్గట్లు 'బుట్టబొమ్మ'లో మార్పులు చేశాం. ఈ మూవీ తెలుగు ప్రేక్షకులను కచ్చితంగా అలరిస్తుంది'' అన్నారు.


శౌరి చంద్రశేఖర్


విజయ్, త్రిష

పదిహేనేళ్ల తర్వాత....

దాదాపు పదిహేనేళ్ల తర్వాత జోడీ కట్టారు హీరో విజయ్– హీరోయిన్ త్రిష. మహేశ్‌బాబు 'ఒక్కడు' తమిళ రీమేక్ 'గిల్లి' (2004)లో తొలిసారి జోడీ కట్టారు విజయ్, త్రిష. ఆ తర్వాత 'తిరుపాచ్చి'(2005), (తెలుగులో 'అన్నవరం'గా రీమేక్ అయ్యింది) తెలుగు 'అతనొక్కడే'కు తమిళ రీమేక్ 'ఆది' (2006), 'కురివి' (2008) సినిమాల్లో జంటగా నటించారు. తాజాగా విజయ్ కెరీర్‌లో 67వ చిత్రంగా తెరకెక్కుతున్న మూవీలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్న విషయాన్ని చిత్ర యూనిట్ ప్రకటించింది. దీంతో విజయ్, త్రిష ఐదోసారి స్క్రీన్ షేర్ చేసుకున్నట్లవుతుంది. 'మాస్టర్' తర్వాత హీరో విజయ్, దర్శకుడు లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం ఇది. సంజయ్ దత్, ప్రియా ఆనంద్, అర్జున్ సర్జా, గౌతమ్ మీనన్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్.

వింతగా మారబోతోంది


బ్రహ్మానందం

తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వంలో భరత్ కుమార్, శ్రీపాద్ నందిరాజ్, ఉపేంద్ర వర్మ, శ్రీనివాస్ కౌశిక్, సాయికృష్ణ గద్వాల్, విజయ్ కుమార్ నిర్మిస్తున్న చిత్రం 'కీడా కోలా'. ఎనిమిది ప్రధాన పాత్రలతో ఈ మూవీ రూపొందుతోంది. వారిలో బ్రహ్మానందం ఒక కీలక పాత్ర చేస్తున్నారు. బుధవారం బ్రహ్మానందం పుట్టినరోజు సందర్భంగా ఆయన ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. 'మీ ప్రపంచం వింతగా మారబోతోంది' అని పోస్టర్‌పై క్యాప్షన్ ఇచ్చారు. ''ప్రతి ఇంట్లో ఉండే తాత పాత్రలో (వరదరాజు) బ్రహ్మానందంగారు కనిపిస్తారు'' అన్నారు తరుణ్ భాస్కర్.

తెరపైకి జాక్సన్ జీవితం

పాప్ సంగీత సామ్రాజ్యానికి రాజుగా వెలిగిన మైఖేల్ జాక్సన్ జీవితంతో 'మైఖేల్' పేరుతో బయోపిక్ రూపొందనుంది. ఈ చిత్రానికి ఆంటోయిన్ పుక్వా దర్శకుడు. మైఖేల్‌గా ఆయన సోదరుడు జెర్మైన్ కుమారుడు జాఫర్ జాక్సన్ నటించనున్నారు. వెండితెరపై యాక్టర్‌గా జాఫర్‌కు ఇదే తొలి చిత్రం. ''మా అంకుల్ కథలో నటించడాన్ని గౌరవంగా భావిస్తున్నాను'' అన్నారు జాఫర్. ''మైఖేల్ జాక్సన్ లక్షణాలు జాఫర్‌లో చాలా ఉన్నాయి. మైఖేల్‌గా నటించగల ఒకే ఒక్క వ్యక్తి జాఫర్ అని నమ్ముతున్నాను'' అన్నారు నిర్మాతల్లో ఒకరైన గ్రాహం. ఇక 1958 ఆగస్టు 29న పుట్టిన మైఖేల్ జాక్సన్ 2009 జూన్ 25న మరణించిన విషయం తెలిసిందే.


మైఖేల్


జాఫర్

లవ్.. యాక్షన్


రక్షిత్, కోమలి

రక్షిత్ అట్లూరి, కోమలీ ప్రసాద్ జంటగా సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'శశివదనే'. గౌరీ నాయుడు సమర్పణలో అహితేజ బెల్లంకొండ నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. శరవణ వాసుదేవన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'శశివదనే..' టైటిల్ సాంగ్‌ని డైరెక్టర్ హరీష్ శంకర్ రిలీజ్ చేశారు. కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించిన ఈ పాటని హరిచరణ్, చిన్మయి శ్రీపాద పాడారు. ''లవ్, యాక్షన్ డ్రామాగా రూపొందిన చిత్రమిది'' అన్నారు సాయి మోహన్. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శ్రీపాల్ చోలేటి, కెమెరా: సాయికుమార్.

అయోమయంలో...


రణధీర్, శుభశ్రీ

రణధీర్, శుభశ్రీ జంటగా ఊర శ్రీను దర్శకత్వంలో 'అయోమయంలో అరవింద' సినిమా ఆరంభం అయింది. డాక్టర్ ప్రసాద్ మూరెళ్ల సహకారంతో లెక్కల మహేంద్రా రెడ్డి నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి వి. శ్రీనివాసరెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, తుమ్మలపల్లి రామసత్యనారాయణ క్లాప్ కొట్టారు. మేడిది వెంకటేశ్వరరావు గౌరవ దర్శకత్వం వహించారు. ''సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న చిత్రమిది'' అన్నారు ఊర శ్రీను. ''ఇప్పటివరకు వచ్చిన కథలకు భిన్నంగా మా చిత్రకథ ఉంటుంది'' అన్నారు మహేంద్రా రెడ్డి. ''ఈ చిత్రంలో మంచి సందేశం ఇస్తున్నాం'' అన్నారు ప్రసాద్ మూరెళ్ల. ఈ చిత్రానికి కెమెరా: జి.అమర్, సంగీతం: శివ కాకాని.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 505/1, Vallur Village, Ongole Sub. Division, Prakasam District - 523272 and Printed at Jagati Publications Limited, Survey No. 505/1, Vallur Village, Ongole Sub. Division, Prakasam District - 523272. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone Nos. (08592) - 278422, Fax : 08592-278266. RNI Regn No. APTEL/2008/23799.